క్లుప్తంగా

సకాలంలో వినతుల పరిష్కారం



వినతులు పరిశీలిస్తున్న జెడ్సీ హైమావతి

పెందుర్తి: వేపగుంటలోని జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిస్కార వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై 5 వినతులు అందాయి. జోనల్ కమిషనర్ హైమావతి ఆయా వినతులను స్వీకరించి సంబంధిత అధికారులకు అప్పగించారు. గడువులోగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటాద్రిపై చాతుర్మాస్య దీక్షలు ప్రారంభం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్ర చాతుర్మాస్య దీక్షలు, కల్యాణోత్సవాలకు సోమవారం అంకురార్పణ జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు చేసి అనంతరం కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా 27 రోజుల పాటు రామాయణ హవనం, 13 రోజుల పాటు కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధులు తెలిపారు.

మర్యాద పూర్వక కలయిక



వీసీ శశిభూషణరావును అభినందిస్తున్న పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

పెందుర్తి: ఆంధ్రయూనివర్సిటీ నూతన వైస్ చాన్సలర్ ఆచార్య జి.శశిభూషణరావును సోమవారం పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ మర్యాద పూర్వకంగా కలిశారు. దుశ్శాలువా కప్పి మొక్క అందజేసి అభినందనలు తెలిపారు. ఇరువురు పలు అంశాలపై చర్చించారు. ఈసీఈ హెడ్ డాక్టర్ ఎం.నాగమణి పాల్గొన్నారు.

గోధుమపిండి టెండర్లలో అవకతవకలు

- రద్దు చేయాలని మిల్లర్ల డిమాండ్

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గోధుమ పిండి కోసం దాఖలైన షార్ట్ టెండర్లను సోమవారం రహస్యంగా తీసి, పాత వారికే కట్టబెట్టారని ఏపీ రోలర్ ఫ్లోర్ మిల్ అసోసియేషన్ నాయకులు ఆరోపించారు. ఈ టెండర్లు దాఖలు చేసిన వారికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సోమవారం అమరావతి సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఎండీ కార్యాలయంలో రహస్యం టెండర్లు తెరిచారని, దీని వల్ల తాము ఎంతో నష్టపోయామని అసోసియేషన్ నాయకులు విశాఖలోని పేర్కొన్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం నాయకులు దృష్టి సారించి, టెండర్ల అవకతవకలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు.

ప్రజా సమస్యలపై పోరాడుదాం

- మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- వైఎస్సార్‌సీపీ ముఖ్యనాయకులతో సమావేశం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ నాయకులకు పిలుపునిచ్చారు. అందరికీ నిరంతరం అందుబాటులో ఉండడంతో పాటు అండగా ఉంటామని చెప్పారు. రాంపురంలోని అదీప్‌రాజ్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ఎన్నికల్లో అనేక హామీలు ప్రజలకు ఇచ్చి అధికారంలో వచ్చిందన్నారు. పింఛన్ల పెంపు మినహా ఇతర ఏ ఒక్క హామీపై కూడా ప్రజలకు భరోసా ఇవ్వలేకపోయిందన్నారు. ప్రజలను మోసం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఆరోపించారు. హామీలు అమలు చేకుండా కాలం గడపడానికి యత్నిస్తున్న సర్కారును నిలదీయడానికి ప్రజల తరపున వారి గొంతుకై పోరాటానికి సిద్ధమవుతామని స్పష్టం చేశారు. పార్టీకి కార్యకర్తలు వెన్నుముక లాంటివారని..వారికి అండగా ఉంటామని చెప్పారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఉప్పిలి కనకరాజు, మధుపాడ అంజి, గొరపల్లి శ్రీను, బొడ్డు సూర్యప్రకాష్, చిరికి దేముడు, ఉగ్గిన గోవింద్, దాడి అర్జున, గనిశెట్టి కనకరాజు, కోన శ్రీను, నందవరపు అప్పలరాజు, ముదపాక శివ, కాళ్ల గంగాధర్, కోరుబిల్లి శ్రీను, గొరపల్లి సాంబ, దిలీప్, సియాద్రి బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో బోధనకు నూతన ప్రణాళిక



మాట్లాడుతున్న ఆర్జేడీ విజయ్‌భాస్కర్

ఆర్జేడీ విజయ్‌భాస్కర్

పెందుర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో బోధనలో నాణ్యత పెంచే దిశగా నూతన ప్రణాళికను అమలు చేస్తున్నామని ఆర్జేడీ బి.విజయ్‌భాస్కర్ అన్నారు. శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమలో ఉన్న మేధాశక్తిని మరింతగా ఉపయోగించి పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయాలని సూచించారు. బోధన నిరంతర ప్రక్రియ అని..విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించేందుకు ఉపాధ్యాయులు సిద్ధంగా ఉండాలన్నారు. పాఠశాలల ఆవరణలో ఏర్పాటు చేసిన అభ్యసన సామగ్రిని తిలకించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణ తరగతులను సందర్శించి ఉపాధ్యాయులకు తగిన సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ న్యాయమూర్తి వెంకటశేషమ్మ, జిల్లా ఉప విద్యాశాఖ అధికారి కె.సువర్ణ, ఎంఈవో–2 మధుమూర్తి, జిల్లా సమగ్ర శిక్ష సహాయ ఏ.ఎం.వో జి.లక్ష్మి, జీహెచ్ఎస్ హెచ్ఎం సి.హెచ్ చిన్మయి, టీచ్ టూల్ ప్రొగ్రాం జిల్లా కో ఆర్డినేటర్ ఎస్.పూర్ణచంద్ర, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివాలయ నిర్మాణానికి విరాళాల అందజేత



ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న పైడంనాయుడు తదితరులు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలో శివాలయం పునర్నిర్మాణానికి పలువురు దాతలు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు సోమవారం విరాళాలు ఇచ్చారు. శివరంజనీ బుక్ సెంటర్ యజమాని సబ్బవరపు పైడంనాయుడు రూ.50,116, అడిగర్ల సత్యం మాస్టారు రూ.20,116 ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దంగేటి నానిబాబు, బర్ల రమణ, గెడ్డం కృష్ణ, జెట్టి ప్రసాద్, టి.శేఖర్, అక్కుబాబు, చింతల శ్రీను పాల్గొన్నారు.

సన్మార్గం వైపు నడిపేది సాహిత్యం



సుగుణరావును సత్కరిస్తున్న డాక్టర్ కూటుకుప్పల సూర్యారావు

సీతంపేట: సమాజాన్ని సన్మార్గపు జీవనశైలి వైపు తిప్పగల శక్తి సాహిత్యానికి ఉందని పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అన్నారు. మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో దశమ సాహితీ పురస్కారాల సభ జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ పూర్వకాలంలో రాజులు కవులను, రచయితలను ప్రోత్సహించేవారన్నారు. ప్రస్తుత కాలంలో డాక్టర్ మక్కెన వంటి సాహితీ పోషకులు కవులను, రచయితలను పురస్కారాలతో గౌరవిస్తున్నారని అభినందించారు. విశిష్ట అతిథి వి.రాజారామ్మోహన్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఆంగ్ల భాష మోజులో పడి తల్లిదండ్రులు తెలుగు భాషను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తేనె కంటె తీయనైన తెలుగు భాష పరిరక్షణకు తెలుగు వారందరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు మక్కెన శ్రీను పదేళ్లుగా సంస్థ ద్వారా చేపట్టిన సాహిత్య కృషిని వివరించారు. అనంతరం సాహిత్య పురస్కారాలకు ఎంపికైన డాక్టర్ ఎం.సుగుణరావు, లేదాళ్ల రాజేశ్వరరావు, బండారు రాజ్‌కుమార్, కొమ్ముల వెంకట సూర్యనారాయణ, మునిసురేష్‌లను ఘనంగా సత్కరించారు. శిరేల సన్యాసిరావు సభకు అధ్యక్షత వహించగా.. మేడా మస్తాన్‌రెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించారు.

25న ఉచిత కంటి వైద్య శిబిరం

పరవాడ: అనకాపల్లి జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో పరవాడ గ్రామంలో ఈ నెల 25న శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సంస్థ ప్రతినిధులు చెప్పారు. ఆరోజు పరవాడ సినిమాహాలు కూడలిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీకార్డు, ఫోను నెంబరు, రెండు జతల దుస్తులు, కంచం, గ్లాసు వెంట తీసుకు రావాలని ఫౌండేషన్ ప్రతినిధులు సూచించారు.

స్వధర్మాచరణ, సేవతోనే మానవ జన్మ సార్థకత



వివిధ కోర్సులు పూర్తిచేసిన మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న గురుప్రసాద్, చింతలపాటి సత్యదేవ్

తాటిచెట్లపాలెం: స్వధర్మాచరణ, నిస్వార్థసేవ, దైవారాధన అనేవి మానవ జన్మ సార్థకతకు దోహదపడతాయని వరల్డ్ టీచర్ ట్రస్ట్(జగద్గురు పీఠం) డైరెక్టర్ ఆఫ్ సర్వీసెస్ డాక్టర్ చింతలపాటి సత్యదేవ్ అన్నారు. తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఇ.కె.సంస్కృతి సదన్‌లో జగద్గురు పీఠం సోదర బృందం సోమవారం నిర్వహించిన మాస్టర్ పార్వతీకుమార్ సతీమణి కృష్ణకుమారి 74వ జయంతి ఉత్సవ సభలో ఆయన మాట్లాడారు. మాస్టర్ పార్వతీకుమార్ సంకల్పంతో సంస్కృతి సదన్‌ను స్థాపించి, ఇప్పటివరకు 1,802 మంది నిరుద్యోగ మహిళలకు వివిధ వృత్తి విద్యల్లో ఉచితంగా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ముఖ్య అతిథి ధనిష్టా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కంభంపాటి చంద్రశేఖర గురుప్రసాద్ మాట్లాడుతూ మాస్టర్ ఇ.కె. చూపిన మార్గంలో మాస్టర్ పార్వతీకుమార్ మార్గదర్శకత్వంలో జగద్గురు పీఠం, ధనిష్టా ఫౌండేషన్ వంటి సంస్థల ద్వారా అనేక కేంద్రాల్లో, విదేశాల్లో కూడా సేవలను అందజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఇక్కడ టైలరింగ్, మెహందీల్లో శిక్షణ పొందిన 49 మంది మహిళలకు ధ్రువపత్రాలను, కొందరికి కుట్టుమిషన్లు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఉషారాణి, ట్రస్ట్ ప్రాంతీయ గణపతి ఎం.ఎస్.ఆర్.స్వామి, మహిళా కేంద్రం నిర్వాహకురాలు దాట్ల రాధ, జన శిక్షణ సంస్థాన్ ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 10 కిలోల గంజాయి పట్టివేత



గంజాయి రవాణాదారులతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో సోమవారం గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో పలు ప్లాట్‌ఫారాల్లో సోమవారం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఎస్ఐ జేకే మీనా, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. పలువురు లగేజీలను తనిఖీ చేసే సమయంలో రాజస్థాన్‌కు చెందిన నందకిషోర్, శ్రీరామ్ బిజార్నియాలు అక్రమంగా గంజాయిని తరలించడం గుర్తించారు. వీరి వద్ద నుంచి సుమారు రూ.50 వేల విలువైన 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని సీజ్ చేసి, నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

‘కిల్కారీ’తో తల్లీబిడ్డల ఆరోగ్యం

- డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు
- కిల్కారీ వాయిస్ కాల్స్‌పై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న స్టేట్ ప్రోగ్రామ్ మేనేజర్ లంకపల్లి రాజు, చిత్రంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు,

మహారాణిపేట: తల్లీబిడ్డల ఆరోగ్యానికి కిల్కారీ సేవలు దోహదపడుతున్నాయని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. రేసపువానిపాలెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) కార్యాలయంలో పట్టణ/ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న ఆశా, నోడల్ అధికారులకు సోమవారం కిల్కారీ మొబైల్ అకాడమీ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా, శిశు మరణాల నియంత్రణే లక్ష్యంగా కిల్కారీ సేవలు వినియోగిస్తున్నామన్నారు. ఈ వాయిస్ కాల్స్ సేవలతో తల్లీ శిశు ఆరోగ్యానికి భద్రత కలుగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై భారత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై అప్రమత్తం చేస్తూ కిల్కారీ పేరిట వాయిస్ కాల్స్ వచ్చేలా ప్రభుత్వం రూపకల్పన చేసిందని డీఎంహెచ్‌వో వివరించారు.

స్టేట్ ప్రొగ్రాం మేనేజర్ లంకపల్లి రాజు మాట్లాడుతూ గర్భిణీగా స్థానిక ఏఎన్ఎం దగ్గర వివరాలు నమోదు చేసుకున్న సమయంలో ఇచ్చిన మొబైల్ నంబర్‌కు ఈ కిల్కారీ వాయిస్ కాల్స్ వస్తాయన్నారు. గర్భిణుల్లో తలెత్తే ఎన్నో సందేహాలను నివృత్తి చేసే విధంగా ఈ వాయిస్ కాల్ సందేశం ఉంటుందన్నారు. నాలుగు నెలల గర్భిణి నుంచి పాలిచ్చే తల్లుల వరకు, బిడ్డకు ఏడాది వయస్సు వచ్చే వరకు 72 సార్లు వాయిస్ కాల్స్ సందేశాలు వచ్చేలా కిల్కారీ కార్యక్రమాన్ని డిజైన్ చేశారని చెప్పారు. ఈ కాల్ సమయం సుమారు 1.30 నిమిషాలు ఉంటుందని, ప్రతి గర్భిణి పూర్తిగా వినడానికి ప్రయత్నించాలని సూచించారు. ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేసిన ప్రతి గర్భిణికి 01244451660 నంబర్ నుంచి వాయిస్ కాల్ వస్తుందని, ఒక వేళ ఫోన్ ఎత్తడం మిస్ అయితే, ఐవీఆర్ సిస్టం ఆటోమేటిక్‌గా ఒకే రోజు 3 సార్లు ఫోన్ కాల్ వచ్చేలా చేస్తుందని రాజు వివరించారు. తిరిగి ఆ సందేశాన్ని వినాలి అనుకున్న వారు 14423 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేసి వినవచ్చునని చెప్పారు. మాతా శిశు ఆరోగ్య సంరక్షణ సేవలు అందించేందుకు మొబైల్ అకాడమీ కోర్సుని 11 మాడ్యూల్స్ ద్వారా రూపకల్పన చేశారన్నారు. 14424 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేసి ఆశా కార్యకర్తలు ఈ కోర్సులో జాయిన్ కావొచ్చునన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రతి గర్భిణికి అవగాహన కల్పించే దిశగా ఆశా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొగ్రాం అధికారులు డాక్టర్ ఎస్.జీవన రాణి, డాక్టర్ బి.ఉమావతి, కె.ప్రశాంత్, ఆర్.మోహనరావు, కె.ధర్మేంద్ర, ఐ.మనోరమ, శశి భూషణ్, మణికుమారి, నాగభూషణం పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

మండల ప్రత్యేక అధికారి కిరణ్ కుమారి



సబ్బవరం సచివాలయంలో తాగునీటి శాంపిళ్లను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి కిరణ్ కుమారి

సబ్బవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి కిరణ్ కుమారి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ శాఖల అధికారులతో పాటు వైద్య సిబ్బందితో సోమవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో డెంగ్యూ,డయేరియా,మలేరియా,టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు.గ్రామాల్లో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని,శానిటేషన్ పనులు పక్కాగా జరగాలని ఆదేశించారు.ఎప్పటికప్పుడు రక్షిత మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్ చేయాలని,తాగునీటి పరీక్షలు కూడా విధిగా చేసి సురక్షితమైన తాగునీరు అందించాలని సూచించారు. మండలంలో నమోదవుతున్న మలేరియా,డెంగ్యూ కేసులపై ఆమె ఆరా తీశారు. నాలుగు డయేరియా కేసులు నమోదయ్యాయని, వైద్య సేవలు అందించడంతో తగ్గాయని సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుక్క కాటు,పాము కాటు వ్యాక్సిన్లతో పాటు మందుల నిల్వలపై ఆమె ఆరా తీశారు. అనంతరం సబ్బవరం సచివాలయంలో నిర్వహించిన తాగునీటి పరీక్షలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహనరావు,ఈవోఆర్డీ మహేష్, వ్యవసాయ శాఖ ఏవో పోతల సత్యనారాయణ, ఏఈలు అర్జున అప్పారావు,హిమబిందు,రామలక్ష్మణ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న పరిశీలకురాలు లలిత కుమారి

పరవాడ: వెన్నలపాలెంలో చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై సోమవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి, సామాజిక తనిఖీ పరిశీలకురాలు లలిత కుమారి మాట్లాడుతూ వెన్నలపాలెం గ్రామంలో ఉపాధి పనుల్లో అవకతవకలు చోటుచేసుకోలేదని చెప్పారు. గ్రామంలో చేపట్టిన 34 పనులకు రూ.25 లక్షలు ఖర్చు చేసినట్టు తెలిపారు. మూడు రోజులుగా సామాజిక తనిఖీ బృందం నిర్వహించిన సామాజిక తనిఖీ రిపోర్టును గ్రామ సభలో సమర్పించారు. కార్యక్రమంలో ఎస్.ఆర్.పి. నాయుడు, సాయి, రాజు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఎం గోవిందరావు, ఎస్.ఎ.నాయుడు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో అధిక లాభాలు

ఏవో సత్యనారాయణ

సబ్బవరం: సేంద్రియ సాగులో అధిక దిగుబడితో పాటు ఆరోగ్యవంతమైన ఆహార ఉత్పత్తులు లభిస్తాయని మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ తెలిపారు. ఖరీఫ్ సాగు చేసే భూముల్లో పచ్చి రొట్ట ఎరువులు వేయడం ద్వారా భూమి సారం పెరుగుతుందని చెప్పారు. సోమవారం ఆయన నారుమడుల నిర్వహణ వంటి పలు అంశాలను వివరించారు. పచ్చి రొట్ట ఎరువులను వర్షాలు పడిన వెంటనే భూమిలో కలియదున్నడం వల్ల వారం రోజుల్లో కుళ్లిపోయి సేంద్రియ ఎరువుగా మారుతుందని తెలిపారు. వరినారు మళ్ల సంరక్షణపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నారు మళ్లలో పాడతెగులు సోకితే హెగ్జాకొనజోల్ 2 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.అగ్గి తెగులు సోకితే ట్రై సైక్లోజోల్ గ్రాము లీటర్ నీటిలో కలపాలన్నారు. దమ్ములకు ముందే పొలాల్లో దుక్కు చేస్తే వరినాట్లు వేసిన తర్వాత కలుపు బెడద తగ్గుతుందన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకోవాలి

- పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీలు గళమెత్తాలి
- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ డిమాండ్
- 1257వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ఆదుకునేందుకు రాష్ట్ర ఎంపీలు, రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పాటుపడాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, అధ్యక్షుడు కె.సత్యనారాయణరావు కోరారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల నేతృత్వంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1257వ రోజు, సోమవారం వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించేలా స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర ఎంపీలందరూ గళం విప్పాలన్నారు. విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని, ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, పూర్తి సామర్థ్యంతో ఉక్కు ఉత్పత్తి సాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీక్ష శిబిరంలో విశాఖస్టీల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు కూర్చున్నారు. నాయకులు కె.రాజబాబు, మసేనురావు, నరేష్‌కుమార్, డొక్కా నరసింగరావు, జి.జయ, శివరామకృష్ణ, తాండ్ర కనకరాజు, చీకటి శ్రీనివాస్, ఎం.ఎం.ఎల్.నాయుడు, వివిధ యూనియన్ల నాయకులు యు.రామస్వామి, వరసాల శ్రీనివాసరావు, విల్లా రామ్మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి వస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. ఆమె పెదగదిలిలోని క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు వారంలో ఒకరోజు ప్రజా రవాణా వ్యవస్థ వినియోగించడం వల్ల విశాఖ నగరంలో కాలుష్య నియంత్రణ సాధ్యమవుతుందన్నారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE CUM M.A.C.T AT : VISAKHAPATNAM
M.O.P.509/2023

Between :
Somayajula Sudhakar Rao & another ... Petitioner
And :
Labba Sudheer Kumar & 2 others ... Respondents

NOTICE

To,
R-1 : Labba Sudheer Kumar, S/o. Appa Rao, D.No. 1-24, Rider of the Motor Cycle AP 31 EQ 8233, Old Village, Chinamushidiwada, Pendurthi, Visakhapatnam.

Please take notice that the above Named petitioner has instituted the Above case against you and the same Stands posted to **14-08-2024** for you Appearance on that day you are personally or through Advocate attend before the Hon'ble Court at 10:30 A.M, falling which the matter will be heard and determined in your absence exparte, asper law.

R.D.BHASKARA RAO,
Advocate,
Visakhapatnam,
Cell : **9848548504**

పారిశ్రామికవాడలో తనిఖీలు

తగరపువలస : ఆనందపురం మండలం బొడ్డపాలెం పారిశ్రామికవాడలోని పరిశ్రమల్లో మూడు రోజులుగా జీఎస్టీ, కార్మికశాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. తనిఖీలపై అధికారులు స్థానికంగా సమాచారం ఇవ్వడం లేదు. తనిఖీలు పూర్తయిన తర్వాత వివరాలు నగరంలోని ప్రధాన కార్యాలయాల ద్వారా తెలియజేయనున్నట్టు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.